# చట్టసభల్లో మహిళలకు 33.33 శాతం రిజర్వేషన్లు కోరుతూ
# రాష్ట్ర శాసనసభ తీర్మానం

అనేక మంది ధీర వనితలు పుట్టిన ఈ గడ్డలో మహిళలకు నాయకత్వ లక్షణాలు పుష్కళంగా వున్నాయనేది నిర్వివాదాంశమని ఆంధ్రప్రదేశ్ శాసనసభ విశ్వసిస్తోంది. మహిళలు 'ఆకాశంలో సగం' అనేది అక్షర సత్యం. తమ కుటుంబాన్ని, పిల్లల్ని ముందుకు నడిపించేది, జీవిత భాగస్వామికి వెన్నుదన్నుగా నిలిచేది స్త్రీమూర్తులే. ఒక్క మాటలో చెప్పాలంటే భారతీయ కుటుంబ వ్యవస్థలో మహిళలే నిజమైన యజమానులు.

వీరి పాత్ర కుటుంబానికి పరిమితం కాకూడదు. ఎంతోమంది మహిళలు పారిశ్రామిక వేత్తలుగా రాణిస్తున్నారు. కార్పొరేట్ సంస్థలను ఒంటిచేత్తో పాలిస్తున్నారు. శాస్త్రవేత్తలుగా, క్రీడాకారులుగా ఇలా ఎన్నో రంగాల్లో తిరుగులేని పాత్ర పోషిస్తున్నారని సభ గుర్తిస్తోంది. వారు నాయకత్వం వహిస్తున్న స్థానిక సంస్థలు ప్రజా సమస్యల్ని పరిష్కరించడంలో ముందున్నాయి. ఇంతటి ఘనత వున్న మహిళలకు మన చట్టసభలలో ప్రాతినిధ్యం గణనీయంగా పెరగాల్సిన అవసరం ఉంది.

స్త్రీని ఆది పరాశక్తిగా, శక్తి స్వరూపిణిగా భావించే మన దేశంలో చట్టసభలకు వచ్చేసరికి మాత్రం సరైన ప్రాతినిధ్యం దక్కకపోవడం పట్ల శాసనసభ విచారం వ్యక్తం చేస్తోంది. కొన్ని దేశాలతో పోల్చుకుంటే ఈ విషయంలో మన దేశం ఎంతో వెనుకబడి వుంది. ప్రస్తుతం 542 మంది సభ్యులు లోక్‌సభలో వుంటే వారిలో 64 మంది, అంటే కేవలం 11.8 శాతం మాత్రమే మహిళా సభ్యులు వున్నారు. రాజ్యసభలో 245 మంది సభ్యులకు గాను 27 మంది మహిళలే వున్నారు. ప్రజాస్వామ్యంలో వీరికి ఎంతమేర న్యాయం జరుగుతుందో ఈ లెక్కలే చెబుతున్నాయి.

మహిళా సాధికారిత సాధించడం వారి ఆత్మాభిమానం కాపాడటం, సమాజంలో ఉన్నత స్థానానికి చేరేలా వెన్నుతట్టి ప్రోత్సహించడంలో ప్రభుత్వం ఎప్పుడూ ముందుంది. దివంగత ముఖ్యమంత్రి శ్రీ నందమూరి తారక రామారావు మహిళలకు ఆస్తిలో సమానహక్కు, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించిన విషయాలను సభ గుర్తు చేసుకుంటోంది. ఎన్టీఆర్ స్ఫూర్తితో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో, విద్యాసంస్థల్లో ప్రవేశాల్లోనూ మహిళలకు 33.33 శాతం రిజర్వేషన్లు ఇచ్చిన ఘనత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికే దక్కుతుంది.

చట్టసభల్లో మహిళలకు పెద్దఎత్తున చోటు దక్కేలా చట్టపరమైన చర్యలు అవసరమని శాసనసభ భావిస్తోంది. మన దేశంలో చట్టసభల్లో మహిళలకు కనీసం మూడోవంతుకు తగ్గకుండా కేంద్ర ప్రభుత్వం త్వరగా రిజర్వేషన్లు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ కోరుతోంది. ఎన్నో ఏళ్లుగా కార్యరూపం దాల్చని ఈ స్వప్నాన్ని సాకారం చేయాలని కేంద్రానికి విజ్ఞప్తి చేస్తూ తీర్మానిస్తోంది.